WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్/మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091



Facebook.varadhi telangana

# విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:42
బుధవారం,
16.10.2024


## ఏపీలో ప్రజలకు సేవ చేయలేరా!

- రేపు రిపోర్టు చేయాలని ఐఏఎస్‌లకు ఆదేశం
- హైకోర్టుకు వెళ్లే యోచనలో అధికారులు

02

## డీఎస్సీ కౌన్సెలింగ్ యథాతథం

హాజరు కావాలంటూ అభ్యర్థులకు సమాచారం

02

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

02

## డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు

02



## ఆత్మనిర్భర్‌లో భాగంగా డేటా సెంటర్లు



02

- దేశీయంగా డేటా భద్రంగానే ఉంటుంది
- ప్రధాని నరేంద్ర మోదీ
- టెలీ కమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ ప్రారంభం

## నేడు బీఆర్ఎస్ కీలక భేటీ

**హైదరాబాద్, అక్టోబర్ 15 :** తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ కీలక సమావేశం జరగనుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం కానున్నారు. హైడ్రా, మూసీ సుందరీకరణపై చర్చించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా హైడ్రా, మూసీ సుందరీకరణ విషయంలో బీఆర్ఎస్ తమ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది. హైడ్రా, మూసీ బాధితులు వందల సంఖ్యలో తెలంగాణ భవన్‌కు చేరుకుని తమ గోడును వెల్లబోసుకున్నారు.

## మీ అయ్య ఫాంహౌస్ ముందు ధర్నా చేయ్ కేటీఆర్



3లో

- రాడార్ కేంద్రాన్ని అనుమతించింది బీఆర్ఎస్
- కేసీఆర్‌సోయిలో ఉండే అనుమతిచ్చారా?
- దేశభద్రత వ్యవస్థను వ్యతిరేకిస్తారా?
- కేటీఆర్‌పై బండి సంజయ్‌ఫైర్





# దేశాభివృద్ధిలో రాజకీయాలు తగవు

### రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్ ముందు

- దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకం
- పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు
- దామగుండం వీఎల్ఎఫ్ ప్రారంభోత్సవంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, స్పీకర్ గడ్డం ప్రసాద్ హాజరు
- రోడ్ల వ్యవస్థ పటిష్టం చేసుకోవడంలో ముందున్నాం : రేవంత్ రెడ్డి వెల్లడి


**హైదరాబాద్, అక్టోబర్ 15 :** పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో అందరూ కలిసి ముందుకెళ్లాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి ప్రసంగించారు. అబ్దుల్ కలాం జయంతి నాడు వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకమన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. కమ్యూనికేషన్ విషయంలో భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి. సాంకేతికయుగంలో కమ్యూనికేషన్ అనేక రకాలుగా ఉపయోగ పడుతుంది. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడి వరకు వచ్చాం. తపాలా వ్యవస్థను అనేక ఏళ్లుగా వినియోగించుకున్నాం. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం.. సమాచారం క్షణాల్లో చేరుతోంది. సమాచార విప్లవం.. ఇవాళ అనేక దేశాలను దగ్గర

మిగతా 2 లో

## ఐటీ ఉద్యోగినిపై లైంగిక దాడి

- అర్ధరాత్రి ఆటో ఎక్కిన యువతిపై ఇద్దరి అఘాయిత్యం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి

02



## రాడార్ ప్రాజెక్టుపై రాజకీయమా

### కేటీఆర్‌పై కిషన్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, అక్టోబర్ 15 :** తెలంగాణకు గర్వకారణమైన రాడార్ ప్రాజెక్టుపై భారాస, కేసీఆర్ కుటుంబం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. భారాస అధికారంలో ఉన్నప్పుడే దీనికి సంబంధించిన జీవోలు ఇచ్చారని గుర్తు చేశారు. నేవీ రాడార్ స్టేషన్‌కు సహకరించాల్సిందిపోయి వ్యతిరేకంగా పోరాటం చేస్తామంటున్నారని విమర్శించారు. దేశ భద్రత, సమగ్రతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారా..? అని నిలదీశారు. రక్షణ శాఖకు సంబంధించిన షిప్స్‌ను కమ్యూనికేట్ చేసే రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణకు ఎంతో పేరు వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లా అటవీ శాఖ నుంచి కేంద్ర పర్యావరణ శాఖ వరకూ అన్ని అనుమతులు పొందిందని చెప్పారు.





## రెండు రాష్ట్రాలకు పరిశీలకులుగా భట్టి, ఉత్తమ్, సీతక్క

3లో

## రాజకీయాలకతీతంగా రాష్ట్ర అభివృద్ధి

- ఇందుకోసం కేంద్రంతో కలిసి పనిచేస్తాం
- రాజ్‌నాథ్‌కు స్వాగతం పలికిన సీఎం రేవంత్

3లో





## బుద్ధి మార్చుకోని కెనడా ప్రభుత్వం

భారత్‌పై ఆంక్షలకు వెనకాడమంటూ ప్రేలాపనలు

.. 3లో



## ఈవీఎంలను తప్పు పట్టడం సరికాదు

ఎగ్జిట్ పోల్స్‌కు అనుకూలంగా ఉంటే కరెక్టా: సిఇసి

.. 3లో

# ఆత్మనిర్భర్‌లో భాగంగా డేటా సెంటర్లు

**దేశీయంగా డేటా భద్రంగానే ఉంటుంది : ప్రధాని నరేంద్ర మోదీ**
**టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ ప్రారంభం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 :** నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ–2024 ఈవెంట్ ఈ ఏడాది ఢిల్లీలో అట్టహాసంగా మొదలైంది. ఈ ఈవెంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లను పరిశీలించారు. దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ ఈవెంట్ 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా డేటా సెంటర్ల గురించి రిలయన్స్ జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రస్తావించారు. 'ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లను భారత్‌లో నెలకొల్పే సామర్థ్యం ఉన్నందున అవి దేశంలోనే ఉండాలని ఆకాశ్ అన్నారు. డేటా సెంటర్ పాలసీ 2020 ముసాయిదాను నవీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో భారత్‌లోని డేటా మొత్తం ఇక్కడి డేటా సెంటర్‌లోనే ఉంటుందన్నారు. భారత్ ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆకాశ్ అంబానీ అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా ప్రతి రంగంలోనూ ముందుకెళ్లేందుకు ఏఐ ఓ విప్లవాత్మక సాధనమని పేర్కొన్నారు. అందుకే ఏఐ, మెషిన్ లెర్నింగ్ డేటా సెంటర్‌లు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. మొదటిసారి భారత్‌లో జరుగుతున్న డబ్ల్యూటీఎస్ఏ కార్యక్రమంలో పాల్గొనేందుకు 190 దేశాల నుంచి 3,000 మంది పారిశ్రామిక, సాంకేతికత నిపుణులు హాజరయ్యారు. 'ది ఫ్యూచర్ ఈ నౌ' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో 120కి పైగా దేశాల నుంచి 400కు పైగా ఎగ్జిబిషన్లు, 900కు పైగా స్టార్టప్‌లు ప్రదర్శించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి సింధియా దేశీయ టెలికాం గురించి మాట్లాడారు. భారత్‌లో టెలికాం అనేది కేవలం వినోద మాధ్యమం కాదని బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కీలకమైన సమాచారం, గ్లోబల్ కమ్యూనిటీతో కనెక్ట్ అయ్యే సదుపాయాల కోసం వేగంగా విస్తరించిందన్నారు. 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోందన్నారు. స్పామ్ కాల్స్ పెరుగుతున్న తరుణంలో వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు.

# ఐటీ ఉద్యోగినిపై లైంగికదాడి

- **అర్ధరాత్రి ఆటో ఎక్కిన యువతిపై ఇద్దరి అఘాయిత్యం**
- **పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి**



**హైదరాబాద్, అక్టోబర్ 15 :** తనపై ఆటో డ్రైవర్ మరొకరు కలిసి అత్యాచారం చేశారని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో యువతి పేర్కొంది. అత్యాచారం చేసిన అనంతరం ఆటో డ్రైవర్‌తో పాటు అతడి స్నేహితుడు పారిపోయినట్లు తెలిపింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అత్యాచారానికి పాల్పడిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువతిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అయిన ఓ యువతి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. కానీ అదే ఆమె జీవితాన్ని నాశనం చేస్తుందని ఆయువతి ఊహించి ఉండదు. ఆర్సీపురం నుంచి గచ్చిబౌలి వెళ్లేందుకు యువతి ఆటో ఎక్కింది. అయితే యువతిపై కన్నేసిన ఆ ఆటో డ్రైవర్ ఆమెను నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అతడితో పాటు ఇంకో వ్యక్తి కూడా ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చీకటి ప్రదేశానికి తీసుకువెళ్లి ఆటలో ఇద్దరు యువకులు అత్యాచారం చేశారు. మసీద్ బండ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆపై ఆ ఇద్దరు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ గటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు

**అధికారులతో సమీక్షించిన సీఎస్**



**హైదరాబాద్, అక్టోబర్ 15:** రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం సచివాలయంలో డీజీపీ జితేందర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదనలపై చర్చించారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగిన ఘటనల నేపథ్యంలో అగ్నిమాపక శాఖకు చెందిన 10 బృందాలు, తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లోని 10 కంపెనీలను వినియోగించి తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సుమారు 2000 మందితో కూడిన బలమైన బలగాలను ఏర్పాటు చేసెందుకు, అవసరమైన బ్జడెట్ కూడా గౌరవ ముఖ్యమంత్రి మంజూరు చేశారని తెలిపారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండేందుకు సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నారు. వచ్చేనెల మొదటి వారం నుంచి సిబ్బందికి మొదటి బ్యాచ్ శిక్షణను ప్రారంభించాలని ఆమె తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్‌లకు అవసరమైన వాహనాలు, రెస్క్యూ పరికరాలు, వ్యక్తిగత రక్షణ పరికరాలు, ఇతర సాధనాల సేకరణ గురించి కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైన పరికరాలు, శిక్షణ అందించడం ద్వారా అగ్నిమాపక శాఖలోని 10 బృందాలను ఎస్‌డిఆర్ఎఫ్ స్టేషన్‌లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. అదేవిధంగా బెటాలియన్‌ల నుండి మొత్తం 1000 మంది సిబ్బంది (ఒక్కో సంస్థ 100 మంది సిబ్బందితో కూడినది) అగ్నిమాపక శాఖ సిబ్బందితో సమానంగా శిక్షణ పొందుతారు. ఈ బృందాలను అత్యవసర పరిస్థితిలో సంబంధిత ప్రదేశాలలో అందుబాటులో ఉంచబడతారు. శిక్షణ కోసం ఎన్‌డిఆర్ఎఫ్ సేవలను వినియోగించుకుంటామని ఆయన తెలిపారు.

# దేశాభివృద్ధిలో రాజకీయాలు తగవు

మొదటి పేజీ తరువాయి

చేస్తోంది. విద్య, వైద్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది. వీఎల్ఎఫ్‌కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు అన్నారు. నావికారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడం అనివార్యం. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పుష్కలంగా ఖనిజ సంపద ఉంది. సముద్రంపై ఆధిపత్యం సాధించిన వాళ్లే మరింత అభివృద్ధి చెందుతారు. సముద్రంపై ఆధిపత్యం ఆంగ్లేయుల విస్తరణకు ఎంతో ఉపయోగపడింది. అత్యాధునిక పరికరాల ద్వారా రక్షణరంగాన్ని బలోపేతం చేస్తాం. దేశ రక్షణ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోము. దేశ రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గం. వీఎల్ఎఫ్ వల్ల స్థానికులపై ఎలాంటి చెడు ప్రభావం ఉండదు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కేంద్రాన్ని మూడేళ్లలో పూర్తి చేసేందుకు కేంద్రం ప్లాన్ రెడీ చేసింది. వెరీ లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడర్ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుకు ఎప్పుడో కేంద్రం ఓకే చెప్పింది. ఇన్ని రోజులకు మంగళవారం భూమిపూజ జరిగింది. మధ్యాహ్నం 12 గంటల 55 నిముషాలకు భూమిపూజ జరిగింది. దేశంలోనే అతిపెద్ద రెండో వీఎల్ఎఫ్ నేవీ రాడార్ సెంటర్‌గా దీన్ని 2027 నాటికి పూర్తి చేయాలని కేంద్రం సంకల్పించింది. దీని నిర్మాణానికి 2,900 ఎకరాల అటవీ భూమిని ఈస్టర్న్ నావెల్ కమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ భూమి అప్పగింతతో ఇక్కడ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు మార్గం సులభమైంది. ఈ రాడార్‌లో సదుపాయాలు కల్పించేందుకు ఈ అటవీ ప్రాంతం చుట్టూ దాదాపు 24 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తారు. ఇప్పుడు శంకుస్థాపన చేసిన ప్రాంతంలో రాడార్ స్టేషన్‌తోపాటు 2500 మంది నివాసం ఉండేలా టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. అందులో స్కూల్స్, హాస్పిటల్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇక్కడ దాదాపు 500 మందికిపైగా నేవీ ఉద్యోగులు, ఇతర సిబ్బంది పని చేస్తారు. రాడార్ కేంద్రానికి శంకుస్థాపన చేసిన తర్వాత వికారాబాద్ పూడూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందన్నారు. దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్, ఎన్.ఎఫ్.సీ లాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందింది. కొందరు వీఎల్ఎఫ్‌ను వివాదం చేస్తున్నారు. వీఎల్ఎఫ్‌తో ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదు. దేశంలో రెండో వీఎల్ఎఫ్ మన ప్రాంతంలో రావడం గర్వకారణమని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలి. వివాదాలకు తెరలేపుతున్నవారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలి. దేశం ఉంటేనే మనం ఉంటాం.. మనం ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దేశ రక్షణ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా రాజకీయాల మోసం వివాదం చేసేవారికి కనువిప్పు కలగాలి. 2017లోనే భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి పూర్తి నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలియజేశారు. 'ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్ నాథ్ సింగ్ అడగ్గానే మేం కొనసాగించాం. దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించా.. పర్యావరణ ప్రేమికులకు నేను ఒకటే చెబుతున్నా... దేశం, దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం... దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్ట్ ను వివాదాస్పదం చేయడం సమంజసం కాదు.. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు... దేశ రక్షణ విషయంలో కలిసికట్టుగా ముందుకెళ్లాలి. వీఎల్ఎఫ్ ను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని తెలిపారు. రాడార్ ఏర్పాటు ప్రాంతంలో గుడికి వచ్చేందుకు ప్రజలకు అనుమతి ఇవ్వాలని రాజ్‌నాథ్‌కు విజ్ఞప్తి చేశారు. ' ఇక్కడ ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చేవారిని అనుమతించాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేస్తున్నా. ఆలయానికి ఇబ్బందులు కలిగించొద్దని కోరుతున్నా.. ప్రజల సెంటిమెంట్, విశ్వాసాన్ని గౌరవించి ఆలయానికి వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరుతున్నా.. ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో ఈ ప్రాంత ప్రజలకు 1/3వ వంతు సీట్లు కేటాయించాలని రేవంత్ రెడ్డి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత విషయంలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మన పార్టీలు వేరు కావొచ్చు.. సిద్ధాంతాలు వేరు కావొచ్చు. దేశ భద్రత, రక్షణ విషయంలో మేం ఎప్పుడూ మీతో కలిసి వస్తాం. దేశ రక్షణ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరుంది. వీఎల్ఎఫ్ ఏర్పాటుకు అత్యంత వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ జిల్లా. కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తూ వివాదాలకు తెరలేపుతు న్నారు. దేశ భద్రత ప్రాజెక్టులకు రాజకీయం చేయడం సరికాదు. ఈ ప్రాజెక్టుకు భారాస ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చింది. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయనివ్వం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ఏపీలో ప్రజలకు సేవ చేయలేరా!

న్యూఢిల్లీ, అక్టోబర్ 15 : ఏపీలో ప్రజలకు సేవ చేసేందుకు ఉన్న ఇబ్బంది ఏమిటని ఐఎఎస్ అధికారులను క్యాట్ ప్రశ్నించినట్లు సమాచారం. రాష్ట్ర పునర్విభజన సందర్భంగా జరిగిన కేటాయింపుల ప్రకారం ఆయా రాష్ట్రాలకు వెళ్లాలంటూ ఈ నెల 9న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఎ.వాణీప్రసాద్, డి.రొనాల్డ్‌రాస్, జి.సృజనలు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన క్యాట్ కీలక వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవ చేయాలని మీకు లేదా? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం గైడ్‌లైన్స్‌లో ఉందా? అని క్యాట్ ప్రశ్నించింది. వన్ మ్యాన్ కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్ అధికారుల తరఫు న్యాయవాది క్యాట్ దృష్టికి తెచ్చారు. సింగిల్‌మెన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేసే ముందు కమిటీ నివేదికను ఇవ్వలేదన్నారు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లో నే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్‌లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు.

# రాజకీయాలకతీతంగా అభివృద్ధి



**వికారాబాద్, అక్టోబర్ 15 :** రాజకీయాలకతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో అతిపెద్ద రాడార్ స్టేషన్‌గా పూడూరు మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రం నిలుస్తుందని సీఎం అన్నారు. వికారాబాద్ జిల్లా పూడురు మండలంలో భారత నేవీ ఏర్పాటు చేస్తోన్న రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాడార్ స్టేషన్ కు భూమిపూజ చేసిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. దేశ రక్షణలో తెలంగాణ భాగస్వామ్యం కీలకమన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌కు సిఎం రేవంత్ ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ దేశ రక్షణకు సంబంధించి కీలకమైన నగరం. తెలంగాణకు మూడు వైపులా సముద్రం ఉంది. ఇక్కడ వీఎల్ఎఫ్ నిర్మాణంతో సముద్ర ప్రాంతం నుంచి చొరబడే ముష్కరుల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ స్టేషన్ తో అనర్థాలు జరుగుతాయని కొందరు అపోహలు కలిగించే ప్రయత్నం చేశారు. కానీ తమిళనాడులో 34 ఏళ్లుగా ఉంది. అక్కడ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దేశ రక్షణ కోసం రాజీపడొద్దనే ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయం. కేంద్రంతో కలిసి నడుస్తాం. దేశ రక్షణ కోసం పెడుతున్న ప్రాజెక్టులపై రాజకీయం చేసేవారు పునరాలోచించుకోవాలి . రాడార్ స్టేషన్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఉంటుంది. దేశభద్రత చాలా ముఖ్యం. రాడార్ స్టేషన్ పై కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు. దేశ రక్షణకు సంబంధించిన విషయాన్ని కూడా రాజకీయం చేయడం తగదు. బీఆర్ఎస్ పదేళ్లు అబద్దాలు చెప్పింది. ఇప్పుడు దేశ రక్షణకు సంబంధించిన అంశంలో కూడా బీఆర్ఎస్ నేతలు అవే అబద్దాలు చెబుతున్నారని సీఎం రేవంత్ విమర్శించారు.



# డీఎస్సీ కౌన్సెలింగ్ యధాతథం

**హైదరాబాద్, అక్టోబర్ 15 :** డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టింగ్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు మంగళవారం ఉదయం విద్యాశాఖ ప్రకటించినప్పటిక ఈసాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో వెంటనే మళ్లీ కౌన్సెలింగ్ ప్రారంభించింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విద్యాశాఖ కీలక ప్రకటన చేసింది. డీఎస్సీ కౌన్సెలింగ్‌ను మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక సమస్యలను అధికారులు పరిష్కరించారు. దీంతో కౌన్సెలింగ్‌కు వచ్చి వెనుదిరిగిన వారికి ఆయా జిల్లాల డీఈవోలు కౌన్సెలింగ్‌కు రావాలని మళ్లీ సమాచారం ఇచ్చారు. డీఎస్సీ 2024 ద్వారా ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్న కొత్త టీచర్లకు మంగళవారం పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. నూతన టీచర్లు ఆయా డీఈఓలు సూచించిన కార్యాలయాల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. అయితే సాంకేతిక కారణాలతో కౌన్సెలింగ్ వాయిదా పడింది. కాగా, కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కానీ సమస్య పరిష్కారం కావడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

**హైదరాబాద్, అక్టోబర్ 15 :** గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీని రీనోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్ల పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరగనున్నాయి. మరోవైపు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక


## మీ అయ్య ఫాంహౌస్ ముందు

# ధర్నా చేయ్ కేటీఆర్



- రాడార్ కేంద్రాన్ని అనుమతించింది బీఆర్ఎస్
- కేసీఆర్‌సోయిలో ఉండే అనుమతిచ్చారా?
- దేశభద్రత వ్యవస్థను వ్యతిరేకిస్తారా?
- కేటీఆర్‌పై బండి సంజయ్‌ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్15: 'కేటీఆర్ కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ ఫాంహౌజ్ ఎదుట ధర్నా చేయ్.. రాడార్ వ్యవస్థ ఏర్పాటుకు ఎందుకు అనుమతి ఇచ్చావని ముందు మీ నాన్నను నిలదీయ్' అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌సూచించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వికారాబాద్ జిల్లా దామగుండం అడవుల్లో ప్రసార స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి భూమి పూజ నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటు అంశం ఇప్పటిది కాదని, పద్నాగేళ్లుగా పెండింగ్ లో ఉందని, అన్ని అడ్డంకులు దాటుకుని ఇవాళ భూమి పూజ చేసుకోవడం సంతోషంగా ఉందని, రక్షణ మంత్రి రాజ్ నాథ్ చొరవ తీసుకోవడంవల్లే ఇది సాధ్యమైందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పేర్కొన్నారు. దురదృష్టకరమేందంటే బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ రాడార్ వ్యవస్థ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని, ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు బదిలీ చేస్తూ 2017న డిసెంబర్ 19న జీవో నెం.44 జారీ చేసిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆమోదించిన బీఆర్ఎస్ నేతలే ఇవాళ వ్యతిరేకిస్తున్నారంటే ఏమనుకోవాలని, వాళ్ల ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం ఆమోదించిన వ్యవస్థను ఆయన కొడుకు ఆధ్వర్యంలో పార్టీ నేతలు వ్యతిరేంచడం విడ్డూరం ఉందన్నారు. కేసీఆర్ ఆనాడు సోయిలో ఉండే అనుమతి ఇచ్చారా? లేదా? తెలుసుకుంటే బాగుండేదని హితవు పలికారు. అనుమతిస్తూ భూముల బదలాయింపుకు ఎందుకు అంగీకారం తెలిపారో కేసీఆర్ ను నిలదీస్తే బాగుండేదని పేర్కొన్నారు. దేశ భద్రతకు సంబంధించి అంశాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు రాజీ లేకుండా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వ్యతిరేకించడమంటే దేశ భద్రతను వ్యతిరేకిస్తున్నట్లే. దేశ రక్షణ వ్యవస్థలను అవమానించిట్లే. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్న తీరును అసహ్యించుకుంటున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాకపోవడం సిగ్గు చేటని మండిపడ్డారు.

# ఫాక్స్‌కాన్ ఘనత మాదే: కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 15 :** లక్ష మంది తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఫాక్స్‌కాన్ కంపెనీని కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మరికొన్ని నెలల్లో కంపెనీ ప్రారంభం కానుండటం గర్వంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టి మరింత విస్తరిస్తారని ఆశిస్తున్నానని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హాన్ హాయ్ టెక్నాలజీ గ్రూప్‌నకు చెందిన ఫాక్స్‌కాన్ తెలంగాణలో రూ.1656 కోట్లకుపైగా పెట్టుబడితో కొంగరకలాన్‌లో పరిశ్రమను నెలకొల్పనుంది. దీనికి సంబంధించి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంతో 2023లో ఫాక్స్‌కాన్ ఒప్పందం చేసుకున్నది. గతేడాది మార్చి 15న కొంగరకలాన్‌లో కేటీఆర్ ఫాక్స్‌కాన్‌కు భూమిపూజ చేశారు. తాజాగా రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి సముఖత వ్యక్తం చేసింది.

### రాష్ట్రంలో చిత్తవుతున్న పత్తి రైతు

పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం ఆడుతున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న పెట్టుబడి సాయం అందించేలేదు, నేడు కష్టపడి పండించిన పంటను పంటను కొనుగోళ్లు చేయరా అని ప్రశ్నించారు. మార్కెట్‌కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలు ఎక్కడన్నారు. ఇందిరమ్మ రాజ్యమని చెప్పి దళారుల రాజ్యం తెస్తారా అని నిలదీశారు. బడే భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం చేస్తుండగా, ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి రైతు చిత్తవుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో పత్తికి మద్దతు ధరకు మించి రూ.8,257 ఇస్తున్నారని, మరి తెలంగాణలో రేతుకు చెల్లిస్తున్నది కేవలం రూ.5 వేలేనా అని ప్రశ్నించారు. రెండేండ్ల క్రితం పత్తి ధర రూ.10 నుంచి రూ.15 వేలు పలికిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ అనర్థం ఏమిటని ఎక్స్ వేదిగా ఫైర్ అయ్యారు. 'బడా భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం. ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి రైతు చిత్తు. గుజరాత్ లో మద్దతు ధరకు మించి రూ.8,257 రేటు. మరి తెలంగాణలో పత్తి రైతుకు కేవలం రూ.5 వేలేనా?. మార్కెట్ కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలెక్కడ?. ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెస్తారా?. రెండేళ్ల క్రితం పత్తికి 10 నుంచి 15 వేల ధర. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏమిటీ అనర్థం?. నిన్న పెట్టుబడి సాయం అందించలేదు.. నేడు కష్టించి పండించినా కొనుగోళ్లు చేయరా..? పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం. ముందుచూపు లేని ముఖ్యమంత్రి వల్లే ఈ అన్యాయం.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గురుకుల భవనాలకు అదదె చెల్లిస్తలేరు. కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తలేరు. కనీసం అన్నం పెట్టలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందని కేటీఆర్ విమర్శించారు. చదువు పక్కనపెట్టి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు రోడ్లపై ధర్నాలు చేసే దుస్థితి తెచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీలను నిరవధికంగా మూసివేయటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసే కాంగ్రెస్ సర్కార్ దగ్గర అదదె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వటానికి పైసలు లేవా? రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేడు, ముఖ్యమంత్రికి విద్యారంగంలో సమస్యలను తెలుసుకునే ఓపిక లేదు. రాష్ట్రంలో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపించే పనిలోనే ముఖ్యమంత్రి బిజీగా ఉన్నాడు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాట మాడుతోంది. ఢిల్లీకి మూటలు పంపించటంపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థులకు మేలు చేయటంలో లేదా? కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించినా, సర్కారుకు చీమ కుట్టినట్లైనా లేదా? వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్ఎస్ సహించదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## బుద్ధి మార్చుకోని

# కెనడా ప్రభుత్వం

### భారత్‌పై ఆంక్షలకు వెనకాడమంటూ ప్రేలాపనలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 :** ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య జరిగిన దగ్గరినుంచి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోన్న కెనడా.. తన బుద్ధి మార్చుకోవడం లేదు. ఇప్పుడు ఏకంగా భారత్‌పై ఆంక్షలకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ ఆ అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామంటూ రెచ్చగొట్టేలా స్పందించారు. నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మను చేర్చడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మళ్లీ భగ్గుమన్నాయి. దీనిపై తాజాగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో న్యూదిల్లీపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. నిజ్జర్ హత్య కేసు దర్యాప్తునకు భారత్ సహకరించడం లేదని ఆరోపించారు. అయితే, కెనడా ఆరోపణలు న్యూదిల్లీ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంది. ఎలాంటి సాక్ష్యాలు ఇవ్వకుండా ఒట్టావా నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా కెనడా ప్రభుత్వం మన రాయబారిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, పెద్దఎత్తున బురద జల్లే ప్రయత్నం చేస్తోందని తీవ్ర పదజాలంతో ఆక్షేపించింది. తాజా పరిణామాల నేపథ్యంలో సంజయ్ కుమార్ వర్మను, మరికొందరు అధికారుల్ని అక్కడి నుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలని కూడా నిర్ణయం తీసుకుంది. వారు ఈనెల 19వ తేదీ రాత్రి 11.59 గంటల్లోగా భారత్‌ను వీడి వెళ్లాలని గడువు విధించింది. ప్రతిగా కెనడా సైతం ఆరుగురు భారత దౌత్యాధికారుల్ని బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇది ఇంతటితో ఆగలేదు. ఈసారి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరును తెరపైకి తెచ్చింది. ఆ గ్యాంగ్‌తో కలిసి భారత ఏజెంట్లు.. ప్రో ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకొని కెనడా భూభాగంపై పని చేస్తున్నారంటూ తీవ్రంగా ఆరోపించింది. తాజాగా ఆ దేశ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ ఆంక్షల ప్రస్తావన తెచ్చారు. మరోవైపు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తో భారత ఏజెంట్లకు సంబంధాలు ఉన్నాయంటూ వ్యాఖ్యానించింది. ఆ గ్యాంగ్‌తో కలిసి భారత ఏజెంట్లు.. ప్రో ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకొని కెనడాలో పని చేస్తున్నారంటూ ఆరోపించింది. 'కెనడాలో ఉన్న భారత ఏజెంట్లు ప్రో ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకొని లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో కలిసి పని చేస్తున్నాయి' అని ఆరోపించింది. ఖలిస్థానీ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసుకు సంబంధించిన దర్యాప్తు పురోగతి వివరాలను రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు సోమవారం రాత్రి మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. భారత ఏజెంట్లు తమ భూభాగంపై హత్యలు, హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. కెనడాలోని దక్షిణాసియా కమ్యూనిటీని ముఖ్యంగా ప్రో ఖలిస్థానీలను భారత ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నేర కార్యకలాపాల్లో బిష్ణోయ్ గ్రూప్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ గ్యాంగ్‌కు భారత ప్రభుత్వ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నట్లు తాము విశ్వసిస్తున్నామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే, ఈ ఆరోపణలకు ఒట్టావా ఎలాంటి ఆధారాలను చూపకపోవడం గమనార్హం.

## నటి జెత్వానీ కేసులో పోలీసుల

# ముందస్తు బెయిల్

### విచారణ జరిపిన కోర్టు... కేసు 23కు వాయిదా

**అమరావతి, అక్టోబర్ 15:** ముంబై నటి జెత్వానీ కేసులో పోలీసు అధికారుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. కేసును తాజాగా సీఐడీకి అప్పగించారని , కౌంటర్లు వేసేందుకు సమయం ఇవ్వాలని కోర్టును పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యర్థించారు. కేసు డిస్పోజ్ అయ్యే వరకు పోలీస్ అధికారులకు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అమలయ్యే విధంగా చూడాలని పిటిషనర్‌ల తరపున న్యాయవాదులు అభ్యర్థించారు. ఈ అంశాలను నోట్ చేసుకున్న న్యాయస్థానం.. కేసు తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది. కాగా.. నటి జెత్వానీ కేసు విచారణను సీఐడీకి అప్పగిస్తూ ఇటీవల డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును విజయవాడ పోలీసులు దర్యాప్తు చేయగా... సీనియర్ పోలీసు అధికారులు నిందితులుగా ఉండటం, ముంబై లింక్‌ల నేపథ్యంలో సీఐడీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ప్రథమ నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో నిందితులుగా ఉన్న అప్పటి విజయవాడ సీపీ క్రాంతి రాణా, డీసీపీ విశాల్ గున్ని, దర్యాప్తు అధికారి సత్యనారాయణ ముందస్తు బెయిల్ కోసం హైకోర్ట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. వైసీపీ హయాంలో జెత్వానీపై కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు చేయగా.. దాని ఆధారంగానే విమానంలో వెళ్లి మరీ ఆమెను విజయవాడకు తీసుకొచ్చారు. దీంతో తప్పుడు కేసు పెట్టి, అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేశారని జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా తనపై అన్యాయంగా కేసు పెట్టి, తల్లిదండ్రులను అరెస్టు చేశారని పోలీసులకు నటి జెత్వానీ ఫిర్యాదు చేశారు. పారిశ్రామికవేత్తపై తాను పెట్టిన కేసును వెనక్కి తీసుకునేలా చేసేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే ఆగమేఘాల మీద ముంబై వచ్చి తనతో పాటు తల్లిదండ్రులను అరెస్టు చేయడం కుట్రలో భాగమేనని ఆమె పేర్కొన్నారు. పీఎస్ఆర్ ఆంజనేయులు నేతృత్వంలోనే తనను అక్రమంగా నిరబంధించారని ఆమె పేర్కొన్నారు. తన పూర్వాపరాలు, ముంబైలో తన నివాసం తదితర అంశాలపై విశాల్ గున్ని ద్వారా ఆరా తీయించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కుక్కల విద్యాసాగర్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. కేసు పెట్టిన విషయాన్ని తెలుసుకున్న అతడు పరారవడంతో పోలీసులు ముమ్మరంగా గాలించి గత నెలలో విద్యాసాగర్‌ను అరెస్ట్ చేశారు. డెహ్రాడూన్‌లో విద్యాసాగర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు విజయవాడ 4వ ఏసీఎంఎం జడ్జి ముందు పోలీసులు హాజరుపరచారు. ఇక.. ఇదే కేసులో ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీ కూడా కీలకంగా ఉన్నారని తేలింది. పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు పెట్టారు. అలాగే ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం.. ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులపై సస్పెన్షన్ వేటు వేసింది. అధికార దుర్వినియోగ ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## రెండు రాష్ట్రాలకు పరిశీలకులుగా

# భట్టి, ఉత్తమ్, సీతక్క

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 :** మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రెండు రాష్ట్రాల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ మంగళవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేసింది. జార్ఖండ్‌కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ఆ పార్టీ సీనియర్ నేతలు తారిక్ అన్వర్, అధిర్ రంజన్ చౌదరిని నియమించారు. ఇక మహారాష్ట్రలోని 5 డివిజన్లకు 11 మంది పరిశీలకులను నియమించగా.. అందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కకు బాధ్యతలు అప్పగించారు.

## 13న వయనాడ్

# ఉప ఎన్నిక

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 :** లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ రాజీనామా నేపథ్యంలో వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 13వ తేదీన ఈ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికను నిర్వహించనున్నట్లు సీఈసీ వెల్లడించింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం న్యూఢిల్లీలో ప్రకటించారు. అదే సమయంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని అసెంబ్లీ, లోక్‌సభ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను సైతం ఆయన విడుదల చేశారు. ఆ క్రమంలో నవంబర్ 13వ తేదీన వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. రాహుల్ రాజీనామా నేపథ్యంలో ఆయన సోదరి ప్రియాంక అక్కడి నుంచి పోటీ చేస్తారని పార్టీ ఇప్పటికే ప్రకటించింది.

## ఈవీఎంలను

# తప్పు పట్టడం సరికాదు

### ఎగ్జిట్ పోల్స్‌కు అనుకూలంగా ఉంటే కరెక్టా: సిఇసి

**న్యూఢిల్లీ,అక్టోబర్15 :** ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మరోసారి తోసిపుచ్చారు. ఎగ్జిట్ పోల్స్ కు అనుకూలంగా ఉంటే ఇవిఎంలు కరెక్ట్ అని లేకుంటే రాంగ్ అనే వాదన సరికాదన్నారు. ఓటింగ్‌లో పాల్గొనడం ద్వారా ప్రజలే ఈ ప్రశ్నలకు సమాధానాలిస్తారని అన్నారు. ఈవీఎంలు 100 శాతం ఫుల్‌ప్రూఫ్‌గా ఉన్నాయని చెప్పారు. ఈవీఎంల పనితీరుపై బీజేపీయేతర పార్టీలు తరచు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలపై సీఈసీ స్పందించారు. ఈ ఆరోపణలన్నీ నిరాధారమైనవని అన్నారు. మహారాష్ట్ర, జార్ఖాండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే సమయంలోనూ ఇదే ప్రశ్నలు అడిగితే మళ్లీ మళ్లీ ఇదే సమధానమిస్తామన్నారు. కేరళలోని వయనాడ్, మహారాష్ట్రలోని నాందేడ్, పశ్చిమబెంగాల్‌లోని జసిర్‌హట్ లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. కాగా, 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26తో ముగుస్తోంది. ఈలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 81 స్థానాలున్న జార్ఖాండ్ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగుస్తుంది. మహారాష్ట్రలో బిజీపీ, శివసేన, ఎన్‌సీపీతో కూడిన మహాయుతి ప్రభుత్వం అధికారంలో ఉండగా, జార్ఖాండ్‌లో జెఎంఎం అధికారంలో ఉంది.

## ఏనుగుల బీభత్సం

### రైతుపై దాడి చేసి తొక్కి చంపిన గుంపు

**చిత్తూరు, అక్టోబర్ 15:** పుంగనూరు నియోజకవర్గం పీలేరులో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఏనుగుల గుంపు రైతుపై దాడి చేసి చంపేశాయి. పుంగనూరు నుంచి పీలేరు వైపునకు వెళ్తూ ఓ మామిడి తోటలోకి ప్రవేశించాయి. వాటిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రైతు రాజారెడ్డిపై తీవ్రంగా దాడి చేశాయి. కాళ్లతో తొక్కి, మట్టిలో కుక్కేసి రైతును దారుణంగా చంపేశాయి. ఈ ఘటన పీలేరులో తీవ్ర కలకలం రేపుతోంది. రైతుపై దాడి ఘటనతో అటవీశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఏనుగుల బెడద నుంచి కాపాడేందుకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ముమ్మరం చేసింది. డిప్యూటీ సీఎం స్వయంగా వెళ్లి కర్ణాటక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని వచ్చారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





## కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**వారధి న్యూస్, కొత్తకోట :** వనపర్తి జిల్లా పరిధిలోని కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్శనలో స్టేషన్ రికార్డులు, పరిసరాలు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూం, ఇతర ప్రాంతాలను సమీక్షించారు. కొత్తకోట ఎస్సై మంజునాథ్ రెడ్డితో కలిసి పెండింగ్ కేసులు, దర్యాప్తు వివరాలు, నేరాలు, రోడ్ ప్రమాదాలు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిస్థితులు వంటి అంశాలను విశ్లేషించారు. ఈ సందర్భంగా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధులు అంకితభావంతో నిర్వహించాలన్నారు. చట్టాలను న్యాయబద్ధంగా అమలు చేయడంతో పాటు, స్వయంగా వాటిని పాటిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనుమానిత వ్యక్తులపై తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం పెట్రోలింగ్, సీసీటీవీ అమరికల ద్వారా ప్రజలకు చైతన్యపరచడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు. వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, కొత్తకోట ఇన్చార్జ్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, ఎస్సై మంజునాథ్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## గందరగోళంగా విద్యా శాఖ ప్రకటనలు

**వారధి న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణ డీఎస్సీ 2024 ఉపాధ్యాయ పోస్టింగ్ కౌన్సెలింగ్‌పై విద్యా శాఖ చేసిన ప్రకటనలు గందరగోళానికి దారితీశాయి. ఉదయం, కౌన్సెలింగ్‌ను సాంకేతిక సమస్యల కారణంగా వాయిదా వేసినట్లు ప్రకటించిన విద్యా శాఖ, గంట ముందే సాంకేతిక సమస్య పరిష్కారమైందని, మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తామని ప్రకటించింది. విద్యా శాఖ మంత్రి అందుబాటులో లేని సమయంలో ఈ విధమైన ప్రతికూల ప్రకటనలు చేయడం అభ్యర్థుల్లో ఆందోళనను కలిగించింది.



నిర్దిష్టత లేకుండా, ప్రకటనల ద్వారా గందరగోళాన్ని సృష్టిస్తున్నారని అభ్యర్థులు విమర్శించారు.

## పంచాలింగాల క్షేత్ర పునర్నిర్మాణ పనుల ప్రారంభం

**అచ్చంపేట మండలం రంగాపూర్ :** ఉమా మహేశ్వర దేవస్థాన క్షేత్రంలోని గుట్టకింద బోగమహేశ్వరంలో పంచలింగలా క్షేత్రాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో పంచలింగాల ఆలయాన్ని పునర్నిర్మాణం పనులను దేవస్థాన కమిటీ చైర్మన్ బీర మాధవరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన పై అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రత్యేకమైన చొరువ తీసుకొని ఎపుడు సమీక్ష జరుపుతూ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతుందని అన్నారు తెలిపారు.



కార్యక్రమంలో పాలక మండలి డైరెక్టర్ పవన్ కుమార్,మాజీ చైర్మన్ లచ్చు నాయక్ శ్రీనివాస్ రావు ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ నాయక్,జబ్బు వెంకట్,శివ,నరసింహ అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సొంత పార్టీపై విమర్శలు చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్

**వారధి న్యూస్, నిజామాబాద్ :** బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తన సొంత పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి ఎందుకు రాలేకపోతోందని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు గెలుచుకున్నా, అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా గెలవలేకపోవడం ఏంటి అని ప్రశ్నించారు. అంతేకాక, బీజేపీ అధికారంలోకి వస్తామన్న ఆశతో ఉండి చివరికి కేవలం 8 ఎమ్మెల్యే సీట్లకే పరిమితమైందని వ్యాఖ్యానించారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు మద్దతు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఎవరిని చెప్పు కింద తొక్కి పెట్టాలో మాకు తెలుసునని ధర్మపురి అరవింద్ స్పష్టం చేశారు. ఈ అంశాలపై బీజేపీ అధిష్టానం సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పిచ్చి కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

**వారధి న్యూస్, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో పిచ్చి కుక్కల దాడి కలకలం రేపింది. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారికి ప్రాథమి కంగా ఆర్‌వి డోస్ ఇవ్వగా, ఇంకా వైద్యం కోసం హిమోగ్లోబిన్ ఇంజెక్షన్ కోసం మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితిని కట్టడి చేసేందుకు స్థానికులు వెంటనే స్పందించి బాధితులకు తగిన సహాయం అందించారు.

# సబ్సిడీ రుణాల గ్రౌండింగ్‌ను వేగవంతం చేయాలి

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వారధి న్యూస్, వనపర్తి :** 2018-19లో స్వయం ఉపాధి కోసం ఎస్సి, ఎస్టీ, మైనారిటీ శాఖల ద్వారా మంజూరైన సబ్సిడీ రుణాలు వారం రోజుల్లో గ్రౌండింగ్ అయ్యేలా సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంక్షేమ శాఖల అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో సమావేశమై ఇప్పటివరకు రుణాలు గ్రౌండింగ్ కాకపోవడానికి గల కారణాలపై సమీక్ష నిర్వహించారు. ఎస్సి, ఎస్టీ, మైనారిటీ శాఖల ద్వారా పేద ప్రజలకు 80 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసినప్పటికీ, 20 శాతం రుణం ఇవ్వడంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందని కలెక్టర్ లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ప్రశ్నించారు. రుణాలు గ్రౌండింగ్ కాకపోవడానికి గల కారణాలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామం వారీగా లబ్ధిదారుల జాబితా తీసుకుని, మండల అభివృద్ధి అధికారులు వారం పది రోజుల్లో రుణాలు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్యూయల్ అకౌంట్ లేని లబ్ధిదారులకు వెంటనే అకౌంట్ ఓపెన్ చేయించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సి.సి.లకు బాధ్యతలు అప్పగించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, గ్రామీణాభివృద్ధి శాఖ పి.డి. ఉమాదేవి, జడ్పి సీఈఓ యాదయ్య, ఆర్డీఓ పద్మావతి, ఈ.డి. ఎస్సి కార్పొరేషన్ మల్లికార్జున్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సుషిత, బి.సి. సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**వారధి న్యూస్, నాగర్ కర్నూలు బ్యూరో :** డీఎస్సీ-2024 ద్వారా జిల్లాలో ఎంపికైన 210 మంది నూతన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ విధానంలో వారికి పాఠశాలలను కేటాయింపుల ప్రక్రియ పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారులు సబ్జెక్టుల వారీగా కౌన్సిలింగ్ నిర్వహించి నూతన ఉపాధ్యాయ అభ్యర్థులకు పాఠశాలల కేటాయింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టి పూర్తి చేసినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్, డీఎస్సీ కమిటీ చైర్మన్ బాదావత్ సంతోష్ తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించి, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు పాఠశాలల కేటాయింపు ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. కౌన్సిలింగ్ ప్రక్రియను, పాఠశాలలు ఉపాధ్యాయ ఖాళీల వివరాలను డీఈఓ గోవిందరాజులు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల విద్యార్థుల సంఖ్య, ఖాళీలను వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే నాగర్ కర్నూల్ జిల్లాలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టుల ఆధారంగా అత్యంత పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి, అభ్యర్థులకు పాఠశాలల కేటాయింపు ఉత్తర్వులను అందజేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. 129 మంది ఎస్జిటి ఉపాధ్యాయులను జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశాలలకు, 13 మంది భాష పండితు ఉపాధ్యాయులు, 66 మంది వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు, ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులకు ఖాళీగా ఉన్న పాఠశాలలకు కేటాయింపుల ఉత్తర్వులను అందజేయడం జరిగిందని తెలిపారు. ఉత్తర్వులు అందుకున్న నూతన ఉపాధ్యాయులు బుధవారం నుండి తమకు కేటాయించిన పాఠశాలలకు హాజరై రిపోర్ట్ చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా కృషి చేయాల్సిన బాధ్యత వహించాలని సూచించారు. ప్రభుత్వ విద్యలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందుంచేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని నూతన ఉపాధ్యాయులను కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిఇఓ గోవింద రాజులు, నోడల్ అధికారి కురుమయ్య, ఏసీ రాజశేఖర్ రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్ రెడ్డి, శోభారాణి, డిఎస్ఓ రాజశేఖర్ రావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివప్రసాద్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ల శెట్టి, వెంకటయ్య నరసింహులు, నూతన ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ ప్రక్రియను వివిధ సంఘాల నాయకులు పాల్గొని పరిశీలించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

**ఎస్పీ అశోక్ కుమార్**



**వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా మెట్ పెల్లి సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్.ఐ ల ద్వారా ఆయా మండలాలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా మెట్ పల్లి సర్కిల్ కార్యాలయాన్ని ఎస్.పి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన సర్కిల్ ఇన్ఫర్మేషన్ బుక్ , క్రైం రికార్డు,ప్రాపర్టీ రిజిస్టర్,పిటిషన్ రిజిస్టర్ లను పరిశీలించారు. సర్కిల్ పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు,అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ,పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్ళు పరిశీలించారు. గ్రేవ్ కేసులలో ఫోక్సో కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని ఎస్.పి సూచించారు. ఎస్.ఓ.పి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని,5 ఎస్ లో ఇంప్లిమెంటేషన్ ని పరిశీలించి ఫైలు సక్రమమైన పద్ధతిలో ఉంచాలని,5 ఎస్ ఇంప్లిమెంటేషన్ చేయాలని సూచించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సూచించారు. అనంతరం మెట్ పల్లి సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి డిఎస్పీ ఉమా మహేశ్వర రావు ,డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,మెట్ పల్లి సి.ఐ నిరంజన్ రెడ్డి,ఎస్.ఐ చిరంజీవి,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉపకార వేతనాలను విడుదల చేయాలని ఆర్డీవోకు వినతి

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలను గృత మూడేళ్లుగా విడుదల చేయడం లేదని కోరుతూ అచ్చంపేట ఆర్డీఓ మాదవికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ గత మూడేళ్లుగా విద్యార్థులకు రావలసిన పకార వేతనాలను విడుదల చేయకపోవడంతో కళాశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపకార వేతనాలను విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు

**వారధి న్యూస్, పెబ్బేరు:** పెబ్బేరు మండలం గుమ్మడం తాండ గ్రామపంచాయతీ సెక్రటరీ మరియుగ్రామ పంచాయతి సిబ్బందిని దూషించిన వ్యక్తిపై పంచాయతి సెక్రటరీ రాజబాబు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పెబ్బేరు ఎస్ ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం గుమ్మడం తండా గ్రామపంచాయతీ చెందిన రవీందర్ ఆటో డ్రైవర్ రాత్రి గ్రామంలోని వీధి దీపాలు వేసే అన్, ఆఫ్ బాక్స్ ను పగులగొట్టి పంచాయతి సక్రటరీనీ, సిబ్బంది దూషించడంతో మంగళవారం గ్రామ పెద్దలతో మాట్లాడు తుండడం తొ అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ ను, మరో వ్యక్తి నీ చెప్పు తొ దాడి చేసి నందుకు గాను రవీందర్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్ ఐ తెలిపారు.

## జిల్లా గ్రంధాలయ నూతన చైర్మన్ గంగాపురం రాజేందర్

**వారధి న్యూస్, నాగర్ కర్నూలు బ్యూరో:** నాగర్ కర్నూలు జిల్లా గ్రంధాలయ నూతన్ చైర్మన్ గా నియమకమైన అచ్చంపేటకు చెందిన మలిదశ ఉద్యమ నాయకులు సీనియర్ న్యాయవాది గంగాపురం రాజేందర్ ను మంగళవారం రాష్ట్ర సచివాలయం అంబెద్కర్ ప్రజా భవన్ లో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణా రావు,పొన్నం ప్రభాకర్ లు శాలువాతో ఘంనగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమ కారులను పూర్తి గా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ఉద్యమ కారులకు సముచిన స్థానం కల్పిస్తుందన్నారు. నాగర్ కర్నూలు ఎమ్మెల్యే కూచికుల్ల రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచికుల్ల దామోదర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## కణతి తొలగింపు

**జనగామ, వారధి న్యూస్:** జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన 47 ఏళ్ల ఇటుకల తబిత అనే మహిళ, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జనగామలోని రవళి నర్సింగ్ హెూమ్ హాస్పిటల్‌కు చేరుకుంది. డాక్టర్ రాజమౌళిని సంప్రదించగా, ఆమెకు నిర్వహించిన వివిధ పరీక్షల ద్వారా కడుపులో పెద్ద కణతి గుర్తించారు. మంగళవారం, డాక్టర్ సి హెచ్ రాజమౌళి ఆధ్వర్యంలో, డాక్టర్ రఘు మరియు అనస్తీసియా పర్యవేక్షణలో శస్త్రచికిత్స నిర్వహించి, 5 కిలోల 100 గ్రాముల బరువున్న కణతిని విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో మోర్తాల ప్రభాకర్, అల్లిసేరి శ్రీనివాస్, అల్వాల రమేష్, కుంటమల్లేష్, మరియు సిస్టర్ సరోజన పాల్గొన్నారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్



## ఎంబిబిఎస్ సీటు సాధించిన పేద విద్యార్థిని మేఘనను అభినందించిన కేటీఆర్

**షాద్ నగర్, వారధి న్యూస్:** ఎంబిబిఎస్ సీటు సాధించిన పేద విద్యార్థిని భైరవుని మేఘనను మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన మేఘన, భైరవుని రమేష్, మంజుల దంపతుల కుమార్తెగా, స్థానికంగా టీ కొట్టు, టిఫిన్ సెంటర్ నిర్వహించే కుటుంబంలో పుట్టి, అభ్యాసంతో ఎంబిబిఎస్ సీటు సాధించడం విశేషంగా నిలిచింది. కేటీఆర్, షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ బచ్చలి నరసింహులు ద్వారా మేఘనను కలుసుకున్నారు. కేటీఆర్, "శభాష్ మేఘన, ఆల్ ది బెస్ట్" అంటూ ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఎన్నారై పొట్టి శ్రీనివాస్ మేఘనకు ప్రోత్సాహకంగా 40 వేల రూపాయల నగదును అందజేశారు. పొట్టి శ్రీనివాస్ తల్లి పొట్టి అమృతమ్మ పేరు మీదుగా ఈ నగదును కేటీఆర్ చేతుల మీదుగా మేఘనకు అందించారు. పేదరికాన్ని అధిగమించి మెరుగైన చదువును కొనసాగించేందుకు కృషి చేసిన మేఘన తల్లిదండ్రులు రమేష్, మంజుల కృషి, విద్యార్థిని మేఘన సాధన పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## తండ్రిని హత్య చేసిన కొడుకుకి జీవిత ఖైదు

**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాపల్లి గ్రామానికి చెందిన గడుగు పోచయ్య తన పేరిట ఉన్న రెండెకరాల భూమిని విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ భూమి అమ్మకం విషయంలో పోచయ్యకు అతని చిన్న కొడుకు ప్రభుదాస్‌కి మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. భూమిని అమ్మిన విషయంలో ప్రతీకారం పెంచుకున్న ప్రభుదాస్ తన తల్లిని రాళ్లతో కొట్టి గాయపరిచగా, తండ్రిని కర్రతో తలపై కొట్టి చంపడం జరిగింది. మృతుని మరదలు అయన సుగుణ ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు అయన గడుగు ప్రభుదాస్ ను కోర్టులో హాజరు పరిచారు. కేస్ ను విచారించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితునికి జీవిత ఖైదు తో పాటు రూ. 5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేస్ లో పీపీ గా మల్లికార్జున్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ గా రవీందర్ రెడ్డి, మహేష్ బాబు, సి.ఎం.ఎస్ ఎస్.ఐ జి. రాజు నాయక్, కానిస్టేబుల్ ఎం. కిరణ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్ లు నిందితునికి శిక్ష పడడంలో కోర్టుకు సాక్షాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర వహించడం జరిగింది. పై కేస్ లో నిందితునికి శిక్ష పడటం లో కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## సిద్దాపూర్ ఇండస్ట్రియల్ పార్కు భూసేకరణలో అవకతవకలపై విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు



**కొత్తూరు, వారధి న్యూస్:** సిద్దాపూర్ గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి కోసం భూసేకరణలో జరిగిన అవకతవకలు, భూ అక్రమణాలపై ఈరోజు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలంగాణ విజిలెన్స్ కమిషనర్ ఎం.జి. గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. సిద్దాపూర్ సర్వే నంబర్లు 252, 278, మరియు 361 పరిధిలో దాదాపు 230 ఎకరాల భూమిని పార్కు కోసం సేకరించారు. మొత్తం సేకరించిన భూమిలో 140 ఎకరాలు అసైన్డ్ భూమిగా ఉండగా, మిగతా భాగం ప్రభుత్వానికి చెందింది. 2021 జనవరి 8న భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయగా, 250 మంది రైతుల నుంచి 240 ఎకరాల భూమిని సేకరించి పరిహారం అందించారని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. రైతులు ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకువచ్చిన వివరాల ప్రకారం, సుమారు 80 మంది వ్యక్తులు భూ రికార్డుల్లో పేర్లు నమోదు లేకపోయినా పరిహారం పొందారని, కొంతమంది తమ భూమి విస్తీర్ణం కంటే ఎక్కువ పరిహారం పొందారని వెల్లడించారు. ఈ అవకతవకలపై లోతైన దర్యాప్తు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషనర్‌కు ఎమ్మెల్యే శంకర్ ఆధారాలతో కూడిన లేఖను అందజేశారు.



## చెరువుల మరమ్మతులకు నిధులు కేటాయించండి

**కేంద్ర మంత్రికి నిధుల కోసం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వినతి**

**మల్కాజిగిరి, వారధి న్యూస్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువుల శుభ్రత కోసం కేంద్ర నిధులు కేటాయించాలని కోరుతూ, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా, తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఎక్కువ గృహాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద ఎక్కువ నిధులను కేటాయించి, హైదరాబాదులోని పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను మల్కాజిగిరి నియోజకవర్గానికి కేటాయించేలా చూడాలని ఆయన కోరారు. అంతేకాకుండా, హర్యానా లో హ్యాట్రిక్ విజయం సాధించినందుకు మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌ను ఈటల రాజేందర్ అభినందించారు.

## కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**



**మహబూబ్‌నగర్, వారధి న్యూస్:** డీఎస్సీ 2024 ఉపాధ్యాయ నియామకాల్లో ఎంపికైన ఉపాధ్యాయులు క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోస్టింగ్‌లు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ, డీఎస్సీ 2024 లో మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తూ, దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, విద్యార్థులకు ఉత్తమమైన విద్యాబోధన అందించాలని సూచించారు. కోరుకున్న చోట పోస్టింగ్ వచ్చినా రాకపోయినా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, భవిష్యత్తులో బదిలీల సమయంలో మరల అవకాశం ఉంటుందని అన్నారు. ఈ నియామక ప్రక్రియలో 196 మంది అభ్యర్థులకు పోస్టింగ్‌లు కేటాయించినట్లు డీఈఓ రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్ రావు, జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు యూసుఫ్‌ను వెంటనే విడుదల చేయాలి : టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**మహబూబ్ నగర్, వారధి న్యూస్:** జర్నలిస్టు యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసు పెట్టడం అన్యాయమని, అతనిని తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొమ్మెర తిరుపతిరెడ్డి, కార్యదర్శి బాపురావు, మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్ తదితరులు కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న యూసుఫ్ ను కలిసారు. జర్నలిస్టు యూసుఫ్ తో మాట్లాడిన నేతలు, కేసుకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. యూసుఫ్ పేర్కొన్నదనుసా రం, అతనిపై అన్యాయంగా తప్పుడు కేసు పెట్టి, జైలులోకి పంపించారని తెలిపారు. దీనికి సంబంధించిన కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని, పోలీసులు కావాలని తనపై తప్పుడు ఆరోపణలు మోపారన్నారు. మామిడి సోమయ్య, బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ, చందుర్తి పోలీసులు యూసుఫ్ పై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరించి, అతనిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అక్రమ కేసులు వేయడం తగదని, యూసుఫ్ పై కేసు నమోదు చేసిన అధికారులపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ జర్నలిస్టులపై తప్పుడు కేసులు కొనసాగడం ఆందోళనకరమని వారు తెలిపారు. యూసుఫ్ ను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## పండుగలకు పోలీస్ భద్రతా ఏర్పాట్లు అభినందనీయం

**ఎస్పీని సన్మానించిన విహెచ్‌పి హిందు సంఘం నేతలు**



**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లాలో ఇటీవల జరిగిన వినాయక చవితి నిమర్జనం, బతుకమ్మ వేడుకలు, దుర్గా నవరాత్రులు, దసరా సంబరాలు ప్రజలు ఘనంగా నిర్వహించుకునేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ అవసరమైన భద్రతా పరమైన ఏర్పాట్లను చేసి సహకరించడం అభినందనీయమని విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ప్రతినిధులు అన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ ఐపిఎస్ ను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకముగా కలిసి శాలువతో సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుగుటకు సహకరించిన ప్రజలకు పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే విధంగా రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ ప్రశాంత వాతావరణంలో పండగలు నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ తరపున కావాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లు చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డి.ఎస్.పి రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** గురువారం జరగబోయే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాభవన్ రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించడం అందుకుగాను వివిధ దళిత సంఘం నాయకులు ఉదయము 10:30 కు అందరూ కళాభవన్ దగ్గర రాగలరు అని మహబూబ్నగర్ జిల్లా కమిటీ కోరిది ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డా దళిత నాయకులు చాలామంది కి నామినేట్ పదవులు ఇయ్యాలని దానిపై చర్చ జరుగుతుందనీ కాబట్టి దళిత సంఘ నాయకులు అందరూ హాజరు కావాలనీ అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నమ్ముకొని ఉన్న కంచిమి లక్ష్మణ్, సాయిబాబా, వినోద్ కుమార్ ప్రవీణ్ కుమార్, మరియు మాచన్పల్లి రాజు పార్టీ కోసం పనిచేసి పార్టీని గెలిపించడానికి సాయ శక్తుల నిరంతరం పోరాటం చేసి కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేయించారని ,ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వారి జీవితాలను కూడా నాశనం చేసిందనీ, కాబట్టి వాళ్లలో దళిత నాయకులు అందర్నీ గుర్తించి వాళ్లకు నామినేట్ పదవులు ఇవ్వాలని పూలే అంబేద్కర్ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కమిటీ తరఫున డిమాండ్ చేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పూలే అంబేద్కర్ జాతర వ్యవస్థాపక అధ్యక్షులు బోయపల్లి నర్సింహులు మాదిగ, గౌరవ అధ్యక్షులు మామిడి సామెల్, పూలే అంబేద్కర్ జాతర ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సిరిసనోల్ల బాలరాజు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిళ్ల రఘునాథ్, ఎండి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



## వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

- వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి కి వాల్మీకి సంఘం సభ్యులు వినతి పత్రం అందజేత

**వారధి న్యూస్, వనపర్తి:** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి విగ్రహ స్థలం కొరకు ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం సభ్యులు డి. నారాయణ, బోయ మురళి, ఉమ్మల రాములు, దేవన్న నాయుడు, సింగోటం నాయుడు, ఎర్ర రవి, ఎం. వెంకటేష్, రాఘవేంద్ర, రవి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

**వారధి న్యూస్, జడ్చర్ల:** స్థానిక డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపిజె అబ్దుల్ కలాం జయంతిని కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. సుకన్య మాట్లాడుతూ, "భారతదేశ రక్షణ వ్యవస్థను బలపరచడంలో అబ్దుల్ కలాం ఎంతో కృషి చేశారని, ఆయన మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా గా గుర్తింపు పొందారు. రాష్ట్రపతిగా ఉండగా సాధారణ జీవితాన్ని గడిపి ప్రజారాష్ట్రపతిగా ఖ్యాతి పొందారు" అని వివరించారు. ఈ కార్యక్రమంలో కలాం గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సదాశివయ్య, నందకోషోర్, మాధురి, ప్రవీణ్ మరియు కళాశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



## రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సిఐటియు జిల్లా కార్యాలయంలో వర్కర్స్ సమావేశంలో పుట్ట ఆంజనేయులు

**వారధి న్యూస్, వనపర్తి:** అక్టోబర్ 15న సిఐటియు జిల్లా కార్యాలయంలో బో, ట్రాలీ వర్కర్స్ విస్తృత స్థాయి సమావేశం ఎం. మోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 100 మంది కార్మికులు సిఐటియూలో చేరారు. సిఐటియు వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మోటారు వెహికల్ యాక్ట్‌ను రద్దు చేయాలని, భారత న్యాయ సంహిత చట్టంలో డ్రైవర్లను దోషులుగా చిత్రీకరించే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అవుతూనే, లక్షల్లో జరిమానాలు వసూలు చేయాలనే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, లైసెన్సులు రద్దు చేయడం ద్వారా జీవనోపాధి లేకుండా చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను ఆపాలని తెలిపారు. ఆయన మాట్లాడుతూ, 29 కార్మిక చట్టాల ఉన్నా నాలుగు లేబర్ కోడులు తెచ్చారని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలను అమలు చేస్తూ, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు, వేతనాల పెంపు హక్కు వంటి వాటిని రద్దు చేస్తున్నదని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు, ఎం. మోహన్, ఎన్. కృష్ణ, రామకృష్ణ, గంధం కృష్ణయ్య, గుంటి కరుణాకర్, బుచ్చన్న, ఎండి. ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వివేకానంద

**వారధి న్యూస్, కుత్బుల్లాపూర్:** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 2 కోట్ల 26 లక్షల రూపాయల నిధులతో నూతన సీసీ రోడ్డు, వీధి దీపాలు, ఓపెన్ జిమ్ వంటి పనులకు ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అపర్ణ పామ్ మెడోస్ వద్ద 98 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు, 10 లక్షల రూపాయలతో ఓపెన్ జిమ్ పరికరాలు, 70 లక్షల రూపాయలతో నూజివీడు మరియు ఐదవ వార్డులో వీధి దీపాలు, 25 లక్షల రూపాయలతో ఏడవ వార్డులో సీసీ రోడ్డు మరియు ఎనిమిదవ వార్డులో 28 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్యెల్యే మాట్లాడుతూ, "గత పదేళ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేసాం. రానున్న రోజుల్లో శివారు మున్సిపాలిటీలకు మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తాం" అని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో కొంపల్లి చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.




# ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ విడుదల చేయాలని ధర్నా

**వారధి న్యూస్, భువనగిరి:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ మరియు స్కాలర్ షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రైవేట్ డిగ్రీ, పి.జి కళాశాలల (టీపీడీపిఎంఏ) ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా, గత మూడు సంవత్సరాల నుండి ఫీజు రియంబర్స్ మెంట్ మరియు స్కాలర్ షిప్‌ల మంజూరుకు నిరాకరణ వల్ల లెక్చరర్స్ వేతనాలు, కళాశాల భవనం అద్దె, పవర్ బిల్, ప్రాపర్టీ టాక్స్ వంటి ఖర్చులు కళాశాలల నిర్వహణకు భారంగా మారాయని తెలిపారు. నిరవధిక కళాశాలల బంద్ లో భాగంగా, రెండవ రోజు వివిధ కళాశాలల యాజమాన్యం, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు. యాజమాన్య సభ్యులు చిక్కా ప్రభాకర్ గౌడ్, సింగనబోయిన మల్లేశం, దరిపల్లి నవీన్ కుమార్, దరిపల్లి ప్రవీణ్ కుమార్, ఏ. మణిపాల్ రెడ్డి ప్రభుత్వానికి తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం కర్తాల శ్రీనివాస్, జి. ఎల్లేష్, కె. రమేష్, సంతోష్, జె వెంకన్న, నవీన్, బాలేశ్వర్, వెంకటరమణ, నల్ల మాస రాజు, శ్రవణ్ కుమార్ రెడ్డి, ఫుల్ చందు, దీపిక, శిరీష పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




## డిఫెన్స్ లీగల్ ఎడ్ కౌన్సిల్ ఉత్తరయ్య

**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమందడి మండలంలోని జగత్తుపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ లీగల్ ఎడ్ కౌన్సిల్ జి. ఉత్తరయ్య పాల్గొని, చట్టాలపై అవగాహన కల్పించారు. జి. ఉత్తరయ్య మాట్లాడుతూ, కుటుంబ అవసరాలకు అప్పులు తీసుకునేటప్పుడు ప్రామిసరీ నోటు లేదా చెక్కు వంటి ధృవీకరణ పత్రాలు తీసుకోవాలని, వాటిపై తేదీ మరియు సంతకాలు ఉండాలన్నారు. లేకపోతే చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని, ఈ పత్రాల కాలపరిమితి మూడు సంవత్సరాలు మాత్రమే ఉంటుందని తెలియజేశారు. అదనంగా, మోటార్ వెహికల్స్ చట్టాలపై వివరాలు అందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు అందించకూడదని, హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన కాగితాలు లేకపోతే క్రిమినల్ కేసులు నమోదవుతాయని, దీనివల్ల భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని చెప్పారు. అసిస్టెంట్ లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. శ్రీదేవి మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేయకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే, తల్లిదండ్రులు, పెళ్లి చేసిన పూజారి, ఫోటోగ్రాఫర్ మరియు పెండ్లికి హాజరైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మదిలేటి, గ్రామ పెద్దలు, లోకదాలత్ సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ప్రమాద ప్రదేశాలను పరిశీలించిన ఎస్పీ



**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** జిల్లా బాలానగర్ నుండి అడ్డకల్ వరకు ఉన్న నేషనల్ హైవే-44పై జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్, పోలీసు అధికారులతో కలిసి ముఖ్యమైన బ్లాక్ స్పాట్స్‌ను సందర్శించారు. ఈ సందర్శనలో, నేషనల్ హైవే-44పై అత్యధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నందున, ప్రమాదాలను నివారించడానికి ఎస్పీ పలు సూచనలు చేశారు:

- స్పీడ్ కంట్రోల్: గరిష్ట వేగ పరిమితిని అమలు చేయాలని, అధిక వేగంతో వెళ్లే వాహనాలను సీసీటీవీ ద్వారా గుర్తించి జరిమానాలు విధించాలని సూచించారు.
- సిగ్నల్స్ మరియు హెచ్చరికలు: ప్రమాదకరమైన మలుపులు, అడ్డగూడులు, స్కూల్ జోన్ మరియు రోడ్డు పనుల ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు మరియు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు.
- కన్స్ట్రక్షన్ క్వాలిటీ మెరుగుపరచడం: రోడ్డు నాణ్యతను మెరుగుపరచడం, గుంతలను సమయానికి సరిచేయడం ముఖ్యమన్నారు.
- సీట్బెల్ట్ మరియు హెల్మెట్ ఉపయోగం: సీట్బెల్ట్ మరియు హెల్మెట్ ధరించడం వంటి భద్రతా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఈ విషయంపై పర్యవేక్షణ పెంచాలని సూచించారు.
- ప్రమాద నివారణ కార్యక్రమాలు: డ్రైవర్లకు అవగాహన సదస్సులు మరియు ప్రమాదాల నివారణపై శిక్షణ తరగతులు నిర్వహించాలని చెప్పారు.
- మెడికల్ ఫెసిలిటీలు: హైవేలపై అత్యవసర మెడికల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాల జరిగిన వెంటనే వైద్య సేవలు అందించేందుకు ఎంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు.
- సీసీటీవీ మరియు ట్రాఫిక్ మానిటరింగ్: కీలక ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని అన్నారు.
- మద్యం సేవించి వాహనం నడపడం నివారణ: మద్యం తాగి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు పక్కన శిక్షణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ చర్యలు అమలు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించి భద్రతను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు, డిసిఆర్బీడీ ఎస్పీ రమణారెడ్డి, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ ఆదిరెడ్డి, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నూతన ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఉత్తర్వులు



**వారధి న్యూస్, మెదక్:** జిల్లాలో 269 మందికి ఉపాధ్యాయులుగా పోస్టింగ్స్ కి సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం మధ్యాహ్నం సమీకృత కలెక్టరేట్ లో జారీ చేయబడ్డాయి. డిఎస్సీ-2024 నియామకాల్లో భాగంగా, మెదక్ జిల్లాలో ఎంపికకాబడిన ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించి, వివిధ పాఠశాలల్లో పోస్టింగ్స్ కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాలను పాటిస్తూ ఈ కౌన్సిలింగ్ జరిగిందని చెప్పారు. జిల్లాలో మొత్తం 272 మంది ఉపాధ్యాయులు ఎంపిక అయినట్లు, కానీ ముగ్గురి పోస్టింగ్ అనివార్య కారణాల వల్ల వాయిదా వేయడం జరిగిందన్నారు. 269 మందికి వివిధ కేటగిరీలలో కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్స్ ఇచ్చారు. నూతన ఉపాధ్యాయులకు రాధాకృష్ణ నాణ్యమైన, గుణాత్మక విద్యను బోధించాలని, భవిష్యత్తు భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉదయం కౌన్సిలింగ్ కి హాజరు కావాలని అభ్యర్థించారు. దీంతో, కొత్త ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు డిఈఓ కార్యాలయం చేరుకున్నారు. కౌన్సిలింగ్ వాయిదా పడినట్లు సమాచారం రావడంతో, వారు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామంటూ డిఈఓ కార్యాలయం నుంచి సమాచారాన్ని అందించారు. అనంతరం 3 గంటల నుండి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సుదర్శన్ మూర్తి, ఎంఈఓ నీలకంఠం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అధ్వాన్నంగా మణికొండ మున్సిపాలిటీలో రోడ్లు

## బీఆర్ఎస్ పార్టీ నేతల ఆందోళన

**వారధి న్యూస్, గండిపేట్:** మణికొండ మున్సిపాలిటీలో ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి రావడం లేదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ మండిపడ్డారు. మంగళవారం, బీఆర్ఎస్ పార్టీ తరపున మణికొండ పురపాలక సంఘ పరిధిలోని నెక్నాంపూర్, నెమలీనగర్, పుప్పాలగూడ, వెంకటేశ్వర కాలనీ, బాపు హిల్స్, పంచవటి కాలనీల్లో రోడ్ల పరిస్థితి మరియు వీధి దీపాల గురించి స్థానిక మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అటువంటి పనులు జరగకపోవడంతో, మాసాబ్ ట్యాంక్ లో ఉన్న కమిషనర్ విపి గౌతమ్‌ను కలిసారు. ఈ సందర్భంగా, రోడ్ల దుస్థితి, నాసిరకం పనులు, మరియు వీధి దీపాల పాడైన పరిస్థితులను వివరించారు. అలాగే, రోడ్లు గుంతలమయం అవడం, మరియు వీధి దీపాలు మూడు, నాలుగు రోజులకే పాడై పోయే పరిస్థితి ఉందని తెలిపారు. నాసిరకం ఇంజనీరింగ్ పనులు, విద్యుత్ దీపాల పనితీరుపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంభగల్ల ధనరాజ్, అందె లక్ష్మణ్ రావు, ఉపేందర్ నాథ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, కందాడ ప్రవీణ్ కుమార్, యాలాల కిరణ్, షేక్ అస్ఫాక్ అలీ, షేక్ ఆరిఫ్, బిన్నీ, కీర్తి లతా గౌడ్ వంటి అనేక నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్‌తో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ భేటీ



**వారధి న్యూస్, భువనగిరి:** బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వలకు త్వరితగతిన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం కోరారు. ఈ సందర్భంగా, చిన్నేరు వాగుపై నాలుగు చెక్ డ్యాంలు నిర్మించడానికి మంత్రిని కోరిన ఎమ్మెల్యే, వడపర్తి, అనాజీపురం, బోల్లేపల్లి, మాదారం వద్ద చెక్ డ్యాంలు నిర్మాణానికి సంబంధించిన అధికారులను మంత్రితో పాటు ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ అధికారి చంద్రశేఖర్ మరియు డిప్యూటీ ఇఎన్ సి శ్రీనివాస్‌తో కలిసి బోల్లేపల్లి, బీమలింగం, అలినగర్ కాల్వల అభివృద్ధి పై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో భువనగిరి మండల కాంగ్రెస్ నాయకులు కూడా పాల్గొన్నారు.




# సైబర్ నేరాలు, డ్రగ్స్ పై అవగాహన

**వారధి న్యూస్, మోత్కూర్:** రాచకొండ కమిషనర్ ఆదేశాల ప్రకారం, భువనగిరి జోన్ పరిధిలోని మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో మంగళవారం ఎస్సై డి నాగరాజు నేతృత్వంలో ప్రజలకు సైబర్ నేరాలు, డ్రగ్స్, పెట్రోలింగ్ వాహనాలు, డయల్ 100 వంటి విషయాలపై క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా, ఎస్సై డి నాగరాజు మాట్లాడుతూ, యువత డ్రగ్స్‌కు బానిస కాకూడదని, అపరిచిత ఫోన్ నెంబర్ల నుండి కాల్స్ వస్తే ఫోన్ ఎత్తకూడదని సూచించారు. అలాగే, అపరిచిత వ్యక్తులు గ్రామంలో సంచరించినప్పుడు, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు.



# ఆర్థిక సాయం

**వారధి న్యూస్, ఉప్పల్:** రామంతపూర్ డివిజన్ ఎండోమెంట్ కాలనీకి చెందిన ఎంబిబిఎస్ విద్యార్థిని యోగితకు ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మంగళవారం రూ. 60,000 చెక్కును అందజేశారు. గతంలో జరిగిన కౌన్సిలింగ్లో యోగిత ములుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే, తన స్వంత నిధులతో చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ చెక్కును అందించారు. కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జోష్ణ నాగేశ్వర్ రావు, పసుల ప్రభాకర్ రెడ్డి, సర్వ బాబు యాదవ్, పవన్ శంకర్, చాంద్‌పాషా, జహంగీర్ పాల్గొన్నారు.




# మృతుని కుటుంబాని పరామర్శించిన వైస్ చైర్మన్ చంద్రకళ

**వారధి న్యూస్, ఆలేరు:** మున్సిపల్ కేంద్రంలోని బుడిగ జంగాల కాలనీకి చెందిన మోతే లింగయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న సింగిల్ విండో వైస్ చైర్మన్ ఇంతకింది చంద్రకళ మురహరి మంగళవారం లింగయ్య నివాసానికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా, మురహరి కుటుంబానికి బియ్యాన్ని అందజేశారు మరియు లింగయ్య కుటుంబానికి తన వంతు సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాలనీవాసులు, మరియు అనేక మంది ప్రజలు పాల్గొన్నారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com




# మత్స్యకారుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

**• జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్**

**వారధి న్యూస్, సిద్దిపేట:** తెలంగాణ మత్స్యకారుల కుటుంబాలను రేవంత్ రెడ్డి రోడ్డు పాలు చేసిందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం, వైస్ మాజీ ఎంపీపీ కీసరి పాపయ్య, రాష్ట్ర నాయకులు రెడ్డి యాదగిరి ముదిరాజులతో కలిసి సిద్దిపేటలో మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పడిన తరువాత మత్స్యకారులను పట్టించుకోవడం లేదు. మత్స్యకారులను చిన్నచూపు చూస్తున్నారు" అని తెలిపారు. గత ప్రభుత్వంలో, ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు మంత్రి హరీష్ రావు ప్రధానంగా మత్స్యకారులకు, ముఖ్యంగా ముదిరాజులకు పెద్దపీట వేశారు. ప్రతి సంవత్సరం వర్షాలు పడగానే చేప పిల్లల పంపిణీ, సబ్సిడీ కింద ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ ఆటోలు, మత్స్యకార మహిళలకు చేపల ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కోసం మొబైల్ క్యాంటీన్ వాహనాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత కెసిఆర్, హరీష్ రావులదేనని పేర్కొన్నారు. "ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మత్స్యకారుల పట్ల ముదిరాజుల పట్ల చవితి తల్లి ప్రేమను చూపిస్తూ, పైసా కూడా కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికి కూడా ఉచిత చేప పిల్లలు ఇవ్వకపోతే మత్స్యకారుల జీవనోపాధి ఎలా గడుస్తుంది?" అని ఆయన నిలదీశారు. కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర యువత అధ్యక్షులు, బిఆర్ఎస్ నాయకులు అడిగే ప్రశాంత్, యువ నాయకులు రాజు, లింగం పాల్గొన్నారు.




# భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**బహుమతుల ప్రధానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రాజ్ కుమార్**

**వారధి న్యూస్, మెదక్:** టేబుల్ టెన్నిస్ జిల్లాస్థాయి విజేతలైన క్రీడాకారులు రాష్ట్ర పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెదక్ పి. రాజ్ కుమార్ అన్నారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ గుల్షన్ క్లబ్ లో నిర్వహించిన టోర్నమెంట్ కం సెలక్షన్స్ లో క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, "భవిష్యత్తులో బాగా రాణించే క్రీడాకారులకు తన వంతు సహాయం చేసి ప్రోత్సహిస్తాన"ని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ కొక్కొండ ప్రభు, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు పిడి ఆనందం, గుల్షన్ క్లబ్ బాధ్యులు శ్యామ్‌రావు, అడ్వకేట్ దొమ్మాట దుర్గారెడ్డి, సభ్యులు హనుమంతు, రవితేజ, అనీష్ పాల్గొన్నారు.



# పేకాటరాయుళ్లపై శంకర్పల్లి పోలీసుల దాడి

**9 మందిని అరెస్ట్**

**వారధి న్యూస్, శంకర్‌పల్లి :** శంకర్పల్లి పోలీసులు సోమవారం సాయంత్రం పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశారు. శంకర్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ వివరాల ప్రకారం, ఆలంకాని గూడ గ్రామంలోని రామకృష్ణారెడ్డి వ్యవసాయ పొలంలో 9 మంది పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందిందని తెలిపారు. ఈ సమాచారం మేరకు ఎస్సై సుందరయ్య, పెట్రోలింగ్ సిబ్బంది రవీందర్ మరియు ధర్మారెడ్డులు సంఘటనా స్థలానికి వెళ్లి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో వారికి చెందిన రూ. 37,230 నగదు, 9 మొబైల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు, 2 సెట్ల ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. అయితే, 9 మందిలో ఒకరు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారి వివరాలు: ఏ మాణిక్ రెడ్డి (శంకర్పల్లి), షేక్ గౌస్ (రావులపల్లి కలాన్), షేక్ మహబూబ్ (శంకర్పల్లి), ఎండి ఆరిఫ్ (శంకర్పల్లి), జనార్దన్ గౌడ్ (పర్వేద), బి రామకృష్ణ (శంకర్పల్లి), హమీద్ (శంకర్పల్లి), ఏ మల్లేశం (శంకర్పల్లి) మరియు హమీద్ (ఫతేపూర్). పరారీలో ఉన్న వ్యక్తి ఆలంఖాన్ అని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

## రామప్పలో మూడవ వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ 2024 ప్రోగ్రామ్ ప్రారంభం




**వారధి న్యూస్, రామప్ప:** రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటడానికి మరియు ప్రపంచ వారసత్వ సంరక్షణ కోసం స్వచ్ఛంద సేవ చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. మంగళవారం మండలంలోని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్పలో మూడవ వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ 2024 ట్రైనింగ్ ప్రోగ్రామ్ మరియు యువ టూరిజం క్లబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ 2024ను జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, "వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ 2024 - వర్కింగ్ ఆన్ ది ఫ్యూచర్" అనే థీమ్‌తో అక్టోబర్ 15 నుండి 26, 2024 వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడనుందని తెలిపా రు. స్వచ్ఛంద సేవలో భాగంగా వరల్డ్ హెరి టేజ్ ప్రాజెక్టు ద్వారా పాల్గొనడం ప్రత్యేక అనుభవమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ నిర్వ హించనుంది, ఇందులో 40 మంది వాలం టీర్స్ దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి మరి యు 40 మంది విద్యార్థులు తెలంగాణ రాష్ట్రంలోని కాలేజీల నుండి పాల్గొనను న్నారు. చరిత్ర, సాంస్కృతికత, మరియు టూరిజం వంటి అంశాలపై లెక్చర్స్ మరియు ఫీల్డ్ ట్రిప్స్ కూడా ఉండనున్నాయి. ప్రొఫెసర్ పాండురంగారావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, మరియు ములుగు డిగ్రీ కాలేజ్ హిస్టరీ లెక్చరర్ లత ఇతర ముఖ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో సహాయపడిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# కలాం దేశానికే ఆదర్శం

**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**




**వారధి న్యూస్, పటాన్చెరు:** దివంగత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికే ఆదర్శప్రాయుడని పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గల ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అత్యంత నిరుపేద కుటుంబం నుండి జీవితాన్ని ప్రారంభించి దేశానికి రాష్ట్రపతి అయ్యారు" అని గుర్తు చేశారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వంగరీ అశోక్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకటేష్, అజ్మత్, రుద్రారం శంకర్, రాజు, ఇమ్రాన్, కొండల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వివేరా హెూటల్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీ



**వారధి న్యూస్, భువనగిరి:** భువనగిరి పట్టణంలోని వివేరా హెూటల్‌పై ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ ఎం. సుమన్ కళ్యాణ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతిలు మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు ఈ దాడి జరగగా, హెూటల్ పై షెడ్యూల్ 4 ప్రకారం తనిఖీలు చేపట్టారు. తనిఖీ సందర్భంగా హెూటల్‌లో అపరిశుభ్రత గమనించడంతో అధికారులు నోటీసు జారీ చేశారు. హెూటల్ వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించిన అధికారులు తాజా కూరగాయలు, ఫస్సై గుర్తింపు పొందిన నూనె, పప్పులు మరియు పిండి పదార్థాలను గడువు తేదీ ముందే వాడాలని సూచించారు. గడువు తేదీ లేని కూల్ డ్రింక్స్‌ను ధ్వంసం చేశారు. అంతేకాకుండా, తయారు చేసిన ఆహార పదార్థాలను ఈగలు, దోమలు, బొద్దింకలు పడకుండా శుభ్రంగా ఉంచాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వాడకూడదని హెచ్చరించారు. ప్రజలకు అందించబోయే ఆహార పదార్థాలు ఆరోగ్యకరంగా ఉండాలని, కల్తీ లేకుండా ఉండాలని నొక్కి చెప్పారు. అలాగే, హెూటల్ నుంచి శాంపిల్స్ సేకరించి హైదరాబాదులోని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. సేకరించిన ఆహార శాంపుల్స్ కల్తీ అని తేలితే, దాని ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు.

# తక్షణమే స్కాలర్షిప్లను విడుదల చేయాలని డిమాండ్

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ**




**వారధి న్యూస్, ఖమ్మం:** గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీజీ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్‌ను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందన లేకపోవడంతో, ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలలు ఈ నెల 14 నుండి రాష్ట్రవ్యాప్తంగా "నిర్వాదిక బందు"ని నిర్వహించనున్నాయి. గిరి ప్రసాద్ భవన్ లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో, ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ, "నాన్ ప్రొఫెషనల్ ఫీజులపై 2000 కోట్లు, ప్రొఫెషనల్ ఫీజులపై 4000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2021-22 సంవత్సరానికి ప్రభుత్వం విడుదల చేసిన బకాయిలు 30%, 2022-23 సంవత్సరానికి 20%, 2023-24 సంవత్సరానికి 0% మాత్రమే ఉంది" అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సరైన మద్దతు ఇవ్వడం లేదని విమర్శిస్తూ, "గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. అదే సమయంలో, 2024, 2025 విద్యా సంవత్సరాలకు సంబంధించి ఇప్పటివరకు స్కాలర్షిప్ ఈపాస్ ఆన్లైన్ డేట్ ప్రభుత్వం ఇవ్వలేదని, కానీ బీసీ స్కాలర్షిప్స్ కోసం 1500 కోట్లు విడుదల చేస్తున్నారని చెప్పారు. స్కాలర్షిప్స్ ఆన్లైన్ డేట్ ఇవ్వకుండానే విడుదల చేసిన 1500 కోట్ల బీసీ స్కాలర్షిప్స్ పై ఎలాంటి వివరాలు లేకపోవడం విషాదంగా ఉందని ఆయన అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 200 కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉన్నాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సమీకృత గురుకులాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం తీసుకునే చర్యలు పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, "ప్రతి గ్రామంలో ప్రతి తండాలో ఒక ప్రభుత్వ పాఠశాల ఉండాలని ప్రభుత్వం చెబుతున్నా, సమకృత గురుకులాల వ్యవస్థను తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నాయి" అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేస్తూ, తక్షణమే జిల్లా మంత్రులు చొరవ తీసుకొని యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.కె నాగులమేర, శివ నాయక్, వంశీ, జిల్లా నాయకులు మనోజ్, రాకేష్, ప్రతాప్, గోపి, రోహిత్, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి స్పందన కరువు



**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** నవాబ్ పేటలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మండల ప్రజావాణికి కార్యక్రమానికి నామమాత్రపు స్పందన మాత్రమే లభిస్తోంది. గత మూడు వారాలుగా, మండల ఉన్నతాధికారులు, అన్ని శాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొనుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదులు చేయడంలో ఆసక్తి చూపించడం లేదు. మూడువారాల వ్యవధిలో కేవలం 13 ఫిర్యాదులు మాత్రమే అధికారులకు అందగా, అందులో 3 ఫిర్యాదులను మాత్రమే పరిష్కరించారు. 10 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండటం వల్ల భవిష్యత్తులో సమస్యల పరిష్కారం మరింత కష్టమవుతుంది. అధికారులు ఒకే చోట ఫిర్యాదులను స్వీకరించేందుకు కూర్చుండగా, ప్రజలు ఫిర్యాదులు చేయడానికి రాకపోవడం ఈ కార్యక్రమానికి బలహీనతగా మారింది. ప్రజలకు ప్రజావాణి కార్యక్రమం గురించి అవగాహన లేకపోవడం, సంబంధిత అధికారులు గ్రామాల్లో చాటింపు ఏర్పాటు చేయకుండా ఉండటమే ప్రధాన కారణం. ప్రజలు తమ సమస్యల గురించి సమగ్ర అవగాహన పెంపొందించే వరకు, ఈ కార్యక్రమంలో ఫిర్యాదులు మరింత మెరుగుపడే అవకాశం లేదు. ఈ కార్యక్రమంలో మండల మేజిస్ట్రేట్ అయిన తహసిల్దార్ తప్పనిసరిగా పాల్గొనాల్సి వున్నందున, ఆయన ప్రాథమిక పనులు ఆలస్యమవుతున్నాయి. ఎంపీడీవో కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించడం అసాధ్యంగా మారింది. గ్రామపంచాయతీ కార్యదర్శులను కార్యక్రమంలో భాగస్వాములుగా తీసుకుంటుండడం వల్ల వారికీ తమ కేటాయించిన గ్రామాల్లో విధులకు హాజరుకావడం కష్టమవుతోంది. సెలవు రోజు ఉన్న ఆదివారం, వారు గ్రామాల వైపు చూడడం లేదు. ఇలాంటి పరిస్థితులు, ప్రభుత్వ లక్ష్యాలను వ్యతిరేకంగా తీసుకువస్తున్నాయి. కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సమయానికి నిర్వహించడం వల్ల, అధికారుల పనితీరుకు చెక్ పడే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పునరాలోచన చేసుకోవాల్సిన అవసరం ఉన్నది, తద్వారా వృధా సమయాన్ని నివారించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించవచ్చు.

## మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో జైలు శిక్ష

**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి :** మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ గంప కరుణాకర్ మంగళవారం తీర్పునిచ్చారు. జగిత్యాల ట్రాఫిక్ ఎస్.ఐ రామచంద్రం తెలిపిన వివరాల ప్రకారం పొలాస గ్రామానికి చెందిన బద్రి వెంకటి అనే వ్యక్తి మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడపడంతో కేసు నమోదు చేయడం జరిగింది. అనంతరం వెంకటి ని సంబంధిత కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపటం వలన రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఒకరి అజాగ్రత్త చర్య వలన వారే కాకుండా ఎదుటివారి ప్రాణాలు పోవటానికి కూడా భాద్యులు అవుతున్నారని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్.ఐ సూచించారు.




## అతి ఉత్కృష్ట పతకానికి డీఎస్పీ రఘు చందర్ ఎంపిక

**అభినందించిన జిల్లా ఎస్పీ**

**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి :** పోలీస్ శాఖలో విశేషమైన సేవలందించినందుకుగాను, మావోయిస్ట్ కార్యకలాపాలను ధైర్యంగా ఎదుర్కొన్నందుకుగా కేంద్ర ప్రభుత్వ అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన అతి ఉత్కృష్ట పతాకకానికి జగిత్యాల డిఎస్పీ రఘు చందర్ ఎంపికయ్యారు. ఎస్పీ అశోక్ కుమార్ రఘు చందర్ ను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారి చట్ట పరిధిలో ప్రజలకు సేవలందించడంతో పాటు నీతి నిజాయితో విధులు నిర్వహించడం ద్వారా ప్రజల గుర్తింపుతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందుతారని అన్నారు. అంతేకాకుండా తోటి పోలీస్ అధికారులకు వారు ఆదర్శంగా నిలుస్తారని,విధుల్లో రాణించడం ద్వారా పొందిన పతకాలు మన జీవితం మధురస్మృతులుగా నిలిచిపోతాయని ఎస్.పి తెలిపారు.



## పీఆర్‌టీయు తెలంగాణ అభ్యర్థులను గెలిపించండి

**ఉపాధ్యాయ సంఘం పిలుపు**


**వారధి న్యూస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలలో పీఆర్‌టీయు తెలంగాణ అభ్యర్థులను గెలిపించాలంటూ పిలుపునిచ్చారు. గత 14 సంవత్సరాలుగా ఉపాధ్యాయ విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న పీఆర్‌టీయు తెలంగాణ సంఘం, మాజీ శాసనమండలి ఛిప్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేయబడింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పోరాడి ఉద్యమ స్ఫూర్తిని నింపుకున్న ఈ సంఘం అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలి. 317 జీవోను అమలు చేసి, స్పౌజ్ బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, ఉద్యోగులకు రావలసిన డిఎలను ఆలస్యం చేయకుండా ఇవ్వాలని వారు కోరారు. పీఆర్‌టీయు తెలంగాణ సంఘం, బాధ్యతగా విధులు నిర్వహిస్తూ, ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాడటమే కాకుండా సామాజిక అంశాలపై కూడా స్పందిస్తుందని తెలియజేశారు. సంఘంలో ఉన్న ప్రతి కార్యకర్తకు స్వేచ్ఛ కలిగి ఉండాలని, రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా ఆధ్వర్యంలో ప్రతిపాదించిన అభ్యర్థులను ఈసారి మండలి ఎన్నికల్లో గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో నియామకం అయ్యి పాఠశాలలో చేరబోతున్న ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతూ, భావి భారత పౌరులను తయారు చేస్తూ మంచి సమాజ నిర్మాణంలో అందరం భాగస్వామ్యమవ్వాలని ఉపాధ్యాయులను ప్రోత్సహించారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com

Movie Time మూవీ టైమ్



# కొత్త సినిమాను ప్రారంభించిన సాయిదుర్గాతేజ్




వైవిధ్యమైన కథలు ఎంచుకునే హీరోల్లో సాయి దుర్గా తేజ్ ఒకరు. 'విరూపాక్ష', 'బ్రో' తర్వాత ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ యంగ్ హీరో పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కొత్త సినిమాను ప్రకటించారు. ఎస్‌డిటి18 వర్కింగ్ టైటిల్‌తో ఇది తెరకెక్కనుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం కానున్నారు. 'ధైర్యాన్నే తన కవచంగా, ఆశనే ఆయుధంగా చేసుకున్న ఈ వ్యక్తి అందరికోసం నిలబడతాడు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే' అనే క్యాప్షన్‌తో ఓ వీడియోను విడుదల చేస్తూ చిత్రబృందం సాయి దుర్గా తేజ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది.

# సుశాంత్ ఇంటిని కొనేసిన ఆదాశర్మ

## పబ్లిసిటీ కోసమే అన్న విమర్శలను తోసిపుచ్చిన నటి

బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఇంటిని నటి అదాశర్మ కొనుగోలు చేసిన తరవాత ఆ ఇంటిని రీమోడలింగ్ చేసి ఇటీవలే కుటుంబంతో సహా అక్కడికి షిఫ్ట్ అయ్యారు. అయితే.. ఆమె పబ్లిసిటీ కోసమే ఇలా చేస్తున్నారని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా వీటిపై అదా స్పందించారు. ఒక నటిగా తనకు చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని ఇలాంటివాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అలాగే ఆ ఇంటిని ఉద్దేశించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'మన జీవితంలో చేయాల్సిన పనులు చాలా ఉంటాయి. అభిప్రాయాలు తెలపడానికి మన దేశంలో పూర్తి హక్కు ఉంటుంది. నేను ఈ ఇంటిని కొనుగోలు చేయడంపై కూడా ఎవరి అభిప్రాయాలు వాళ్లు వెల్లడించారు. 'నేను మంచి వ్యక్తిని' అని రుజువు చేసుకోవాల్సిన అవసరం లేదు. నాకు చేయాలనిపించినది నేను చేశా. నా కోసం ఎవరూ మారకూడదని నేను అనుకుంటాను. అదే రూల్ ఇతరులకు వర్తిస్తుంది. వారి కోసం నేను నా పద్ధతిని మార్చుకోను' అని చెప్పారు. ఇక సుశాంత్ ఇంటి గురించి మాట్లాడుతూ.. 'నాకు ఈ ఇల్లు ఎంతో నచ్చింది. మా అమ్మ, అమ్మమ్మతో కలిసి ఇక్కడ ఉంటున్నాను. ఈ ఇంట్లో ఏదో తెలియని శక్తి ఉంది' అని తెలిపారు. గతంలోనూ ఈ ఇంటిపై అదా ఇలాంటి కామెంట్సే చేశారు. సుశాంత్ ఇంటిని చూడగానే తనకు ఎంతో పాజిటివ్‌గా అనిపించిందన్నారు. అందుకే కొన్నట్లు వెల్లడించారు. మొత్తం రీమోడలింగ్ చేశానన్నారు. మొదటి అంతస్తుని గుడిలా మార్చేసి నట్లు చెప్పారు. ఒక గదిని మ్యూజిక్ రూమ్‌గా, మరో దాన్ని డ్యాన్స్ స్టూడియోగా చేశానన్నారు. టెర్రస్ మొత్తం గా÷-డ్గ÷న్‌లా మార్చేసినట్లు తెలిపారు. నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ 2020 జూన్ 14న ఆత్మహత్య చేసుకున్నారు. తన నివాసంలోనే ఉరి వేసుకున్నారు. సినిమాల్లో అవకాశాలు లేకపోవడం, వ్యక్తిగత కారణాల వల్ల మానసిక కుంగుబాటుకు గురి కావడంతోనే ఆయన మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఇప్పుడు అదే ఇంటిని అదా కొనుగోలు చేసి అందులోకి షిఫ్ట్ కావడంతో బాలీవుడ్‌లో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.


# టెంపుల్ ట్రెజరీ ఆధారంగా నాగబంధం





'పెదకాపు' చిత్రంతో పరిచయమైన విరాట్‌కర్ణ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్'. నభా నటేశ్ కథానాయిక. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, తారక్ సినిమాస్ సంస్థలతో కలిసి ఎన్.ఐ.కె.స్టూడియోస్ పతాకంపై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పకులు. ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. అగ్ర కథానాయకుడు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి క్లాప్‌నిచ్చారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు అజయ్ భూపతి గౌరవ దర్శకత్వం వహించారు. ఏషియన్ సునీల్ చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. తిరువనంతపురంలోని పద్మనాభ స్వామి ఆలయంలో నిధి, పూరి జగన్నాథ ఆలయంలో రత్న భాండాగారాన్ని తెరిచిన తర్వాత గుప్తనిధుల అంశం చర్చనీయాంశంగా మారింది. నాగబంధం రక్షణలో ఉన్న అలాంటి 108 దేవాలయాలతో ముడిపడిన కథ ఇది. భక్తి, సాహసాలు, అంతుచిక్కని రహస్యాలతో ఓ శక్తిమంతమైన కథని తయారు చేశారు అభిషేక్ నామా. ఈ నెల 23 నుంచే రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేస్తామని సినీ వర్గాలు తెలిపాయి. కథానాయకుడు విరాట్‌కర్ణ మాట్లాడుతూ ఈ సినిమా చాలా బాగుంటుంది. చిరంజీవి చేతులమీదుగా ప్రారంభం కావడం ఆనందంగా ఉందని అన్నారు. ఐశ్వర్య మేనన్, జగపతిబాబు, జయప్రకాశ్, మురళీశర్మ, బి.ఎస్.అవినాశ్ తదితరులు నటిస్తున్నారు.

# ఇడ్లీ కొట్టుతో వస్తోన్న నిత్యామీనన్

ఎంచుకునే ప్రతి పాత్రలోనూ తన సహజమైన నటనతో సినీప్రియుల్ని మెప్పిస్తుంటుంది అందాల తార నిత్యామేనన్. ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్న ఈమె.. తమిళ కథానాయకుడు ధనుష్‌తో కలిసి 'ఇడ్లీ కడై'(ఇడ్లీ కొట్టు) అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. 'కొత్త ప్రకటన.. కొత్త ప్రయాణం... 'ఇడ్లీకడై' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ఫొటోను పంచుకుంది నిత్య. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైనట్లు చిత్రవర్గాలు తెలిపాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ధనుష్ తెరకెక్కిస్తున్నారు. డాన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, షాలినీ పాండే తదితరులు నటిస్తున్నారు. 'తిరు' చిత్రంలో స్నేహితులుగా కనిపించి అభిమానుల్ని అలరించిన ధనుష్, నిత్య.. మరి ఈసారి తెరపై ఎలాంటి మ్యాజిక్ సృష్టిస్తారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



# గేమ్‌ఛేంజర్‌కు పోటీగా తండేల్ విడుదల




టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న ప్రాజెక్ట్ తండేల్ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని చందూ మొండేటి డైరెక్ట్ చేస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు చాలా రోజుల క్రితమే ప్రకటించగా.. తండేల్ విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయంటూ మరో వార్త తెరపైకి వచ్చింది. తాజాగా తండేల్ సంక్రాంతి బరిలో నిలువబోతుందన్న అప్‌డేట్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరోవైపు రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న గేమ్ ఛేంజర్ 2025 జనవరి 10న విడుదల కానుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారని తెలిసిందే. ఇదే నిజమైతే బాక్సాఫీస్ వద్ద గేమ్ ఛేంజర్‌తో పోటీ పడటం ఖాయమైపోయినట్టే. మరి తండేల్ రిలీజ్‌పై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. తండేల్‌లో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్రలో నటిస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడం విశేషం. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు.

# వాళై చిత్రంతో అద్భుత నటన

## దర్శకుడి ప్రతిభ అంటున్న నటి నిఖిలా విమల్



తాను ఒక పరికరాన్ని మాత్రమేనని, దర్శకుడు తనకు నచ్చిన రీతిలో మలచుకున్నారని హీరోయిన్ నిఖిలా విమల్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఆయన స్వీయ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'వాళై'ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సినిమాలో పూంగొడి టీచర్‌గా కీలక పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించిన నిఖిలా విమల్ చిత్రంలో నటించిన తన అనుభవం, పూంగొడి టీచర్ పాత్రను దర్శకుడు మలిచిన తీరు వర్ణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'వాళై' సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప విషయం. ఆ పాత్రకు తగినట్టుగా దర్శకుడు నన్ను మలుచు కున్నారన్నారు. నేను ఒక పరికరాన్ని మాత్రమే. 'కర్ణన్' చిత్రంలో హీరోయిన్ రజీషా విజయన్ పాత్రకు డబ్బింగ్ చెప్పడానికి చెన్నైకి రాగా ఆ సమయంలోనే 'వాళై'చిత్రం గురించి దర్శకుడు చెప్పారు. చెప్పిన మాట ప్రకారం చిత్రాన్ని నిర్మించి, అందులో నా కెరీర్‌లో నిలిచిపోయే పాత్రను ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటాను' అని పేర్కొన్నారు.